అంధులకు చేయూతనందించాలి: కలెక్టర్

బ్రెయిలీ విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, జనవరి 4: చూపు లేక అంధత్వంతో బాధపడుతున్న వారికి చేయూతనందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. అంధుల ఆశా జ్యోతి లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని, జిల్లా కేంద్రంలోని శాతవాహన వర్సిటీ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇటీవల అంధుల పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. అంధుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య అంధ విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేశారు. మహిళా, శిశు సంక్షేమం, వయోవృద్ధులు, వికలాంగుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీడబ్ల్యూవో కె.సబితకుమారి, ఎంసీహెచ్‌పీ సనా జవేరియా, కరీంనగర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శరత్‌కృష్ణ, క్లబ్ సభ్యులు, అంధుల సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కలెక్టరేట్, జనవరి 4 : నమో మిషన్ వందే గోమాతరం సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, సమాజానికి హితం చేసే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గోమాతరం ఫౌండర్ వీరమద్విరాజ్ ఆచారి, కోఫౌండర్ డా. దైవాల వేణుకుమార్, సభ్యులు కనపర్తి మురళి, పూర్ణచందర్, శ్రీమాన్, పట్టమ్‌దీపక్, శశిబాబు, రణధీర్‌సింగ్, అశోక్‌సామ్రాట్, తిరుపతి, సంజిత్‌సింగ్ పాల్గొన్నారు.

కరీంనగర్‌ను యూజీడీ ఫ్రీ నగరంగా మార్చుతాం: కమిషనర్

కార్పొరేషన్, జనవరి 4: కరీంనగర్‌ను యూజీడీ ఫ్రీ నగరంగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. నగరంలో అమృత్ పథకం కింద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఇన్‌స్పెక్షన్ చాంబర్స్ శుభ్రత పనులు చేపట్టగా, శనివారం 55వ డివిజన్ మంకమ్మతోట ప్రాంతంలో కొనసాగుతున్న పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రస్తుతం క్లీనింగ్ పనులను తెలంగాణ చౌక్ నుంచి భాగ్యనగర్ వరకు పూర్తి చేసి, మిగిలిన కాలనీల్లో కూడా చేపట్టాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. యూజీడీ నెట్ వర్క్‌ను త్వరలోనే సీవరేజ్ ప్లాంట్‌కు అనుసంధానం చేసి, మురుగు నీటి శుద్ధీకరణ ప్రక్రియ ద్వారా శుభ్రం చేసి, తిరిగి ఇతర అవసరాలకు వాడుకునేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య శాఖ అధికారి దేవేందర్ రెడ్డి, నగరపాలక సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాలి

కార్పొరేషన్, జనవరి 4: నగరపాలక సంస్థ పరిధిలోని డివిజన్లలో వార్డు ఆఫీసర్లుగా ప్రజలకు మెరుగైన సేవలందించాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. నగరపాలక సంస్థలో ఇటీవల వార్డు ఆఫీసర్లుగా నియామకమై.. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులతో శనివారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో కమిషనర్ సమావేశం నిర్వహించారు. వారికి పలు సూచనలు చేశారు. విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని నిర్దేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, టౌన్ ప్లానింగ్ అధికారి వేణుమాధవ్ నూతన ఉద్యోగులు పాల్గొన్నారు.

అప్పార్ కార్డు జనరేషన్‌పై అవగాహన

చొప్పదండి, జనవరి 4: పట్టణంలోని మండల వనరుల కేంద్రంలో ఎంఈవో శ్రీనివాస్ దీక్షిత్ ఆధ్వర్యంలో అప్పార్ కార్డు జనరేషన్‌పై మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్లానింగ్ కోఆర్డినేట్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థి అర్హతల సర్టిఫికెట్లు అన్నీ ఒక బ్యాంక్ లాగా దీనిలో భద్రపరుచుకోవచ్చని తెలిపారు. ఒకవేళ సర్టిఫికెట్లు పోగొట్టుకున్న సందర్భంలో ఆటోమేటిగ్గా ఈ పోర్టల్ నుంచి ఒరిజినల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. అప్పార్ జనరేట్ చేసుకునే విధానాన్ని ఏఎస్‌వో మహేందర్ వివరించారు.

రాగి వైర్లు చోరీ

చొప్పదండి, జనవరి 4: గుమ్లాపూర్ గ్రామ శివారులో మెగా ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీలో చోరీ జరిగింది. రూ.21లక్షల 54వేల విలువ గల సింగిల్ కోర్ రాగి వైర్లు, రాగి బస్ బార్లు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని శనివారం ఎలక్ట్రో మెకానికల్ మేనేజర్ నేనావత్ గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనూష ఒక ప్రకటనలో తెలిపారు.

త్వరలో అందుబాటులోకి స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు

- మేయర్ సునీల్‌రావు

35వ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, జనవరి 4: కరీంనగర్ స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా రూ.120 కోట్లతో అభివృద్ధి చేసిన ప్రాజెక్టులను సంక్రాంతి తర్వాత ప్రారంభోత్సవాలు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. శనివారం 35వ డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీలో రూ.37 లక్షలతో చేపట్టే డ్రైనేజీ పైపులైన్ పనులను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు, పాలకవర్గ సభ్యులు, అధికారుల సమష్టి కృషితోనే నగరంలో అభివృద్ధి జరిగిందన్నారు. ఈ నెలలోనే రూ.120 కోట్లతో అభివృద్ధి చేసిన స్పోర్ట్స్ కాంప్లెక్స్, మల్టీపర్పస్ పార్క్, రాజీవ్ పార్కు, ఈ-క్లాస్ రూంలు, పద్మనగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్, స్ట్రీట్ వెండింగ్ షాపులు, అంబేద్కర్ విగ్రహం, 24 గంటల మంచినీటి పైలెట్ ప్రాజెక్టు తదితర ప్రాజెక్టులను కేంద్ర, రాష్ట్ర మంత్రులు బండి సంజయ్ కుమార్, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, స్థానిక శాసన సభ్యుడు గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి ప్రారంభోత్సవాలు చేస్తామన్నారు. ఇందులో పెండింగ్‌లో ఉన్న కశ్మీర్‌గడ్డ ఇంటిగ్రేటెడ్ మార్కెట్, కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద గల ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనం, డిజిటల్ లైబ్రరీ భవనాల పనులు ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయని తెలిపారు. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో చక్కటి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పార్కులు, లైటింగ్, తాగునీటి వ్యవస్థలు, పారిశుధ్యం లాంటివి మెరుగుపడ్డాయంటే ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యులు, అధికారులు అందరి కృషితోనే సాధ్యమైందని పేర్కొన్నారు. నగరంలో ప్రజల భద్రత, ఆరోగ్యం, సౌకర్యాలకు పెద్దపీట వేశామని, ఇందులో భాగంగానే 35వ డివిజన్‌లో కూడా చాలా అభివృద్ధి పనులు చేపట్టి 95 శాతం పూర్తి చేశామని తెలిపారు. గతంలో వర్షాలు కురిస్తే సప్తగిరి కాలనీ, శ్రీనగర్ కాలనీ లాంటి లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ఈ సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, ఈఈ సుబ్రహ్మణ్యం, డీఈ అయూబ్ ఖాన్, ఏఈ గట్టు స్వామి, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

తెలంగాణచౌక్, జనవరి 4:నగర పాలక సంస్థ కార్యాలయంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజమల్లు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగరపాలక సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు పోచయ్య, రామమల్లయ్య, గంగయ్య, చంద్రయ్య, జ్యోతి, బుజ్జమ్మ పాల్గొన్నారు.

కార్మికులకు రూ.26వేల జీతం ఇవ్వాలి

హుజూరాబాద్, జనవరి 4: మున్సిపల్ కార్మికులకు రూ.26వేల జీతం ఇవ్వాలని మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ సంఘం హుజూరాబాద్ అధ్యక్షుడు అజ్జూ డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో కార్మికులు శనివారం 48 గంటల దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అజ్జూ మాట్లాడుతూ, కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 6న కలెక్టరేట్ ముట్టడి చేపడుతామని, ఆ తర్వాత కూడా సమస్యలు పరిష్కరించకపోతే 27 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. ఇక్కడ నాయకులు, కార్మికులు కొప్పుల శంకర్, సరోజన, బొరగాల కుమార్, రాజేశ్వరి, సులోచన, అన్నపూర్ణ, శ్రీనివాస్, సతీశ్, సాంబయ్య తదితరులున్నారు.

'అద్వితా' విద్యార్థిని ప్రతిభ

విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

కమాన్‌చౌరస్తా, జనవరి 4 : శ్రీమద్భగవద్గీత పారాయణ పోటీలో అద్విత ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని కె. లస్యాశ్రీ స్వర్ణ పతకం సాధించింది. ఈ మేరకు పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినిని పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ అనుదీప్ సొగని, ప్రిన్సిపాల్ శ్వేత ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 5వ తరగతి విద్యార్థిని లస్యాశ్రీ విజయవాడలో ప్రతిష్టాత్మకంగా జరిగిన శ్రీమద్భగవద్గీత పారాయణ పోటీలో స్వర్ణ పతకం, సర్టిఫికెట్ సాధించి పాఠశాల గౌరవాన్ని రెట్టింపు చేసిందని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

వన్నారంలో రామారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రసమయి

మానకొండూర్ రూరల్, జనవరి 4: వన్నారం మాజీ సర్పంచ్ పోలాడి రామారావు ఇటీవల మృతి చెందగా, శనివారం ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పరామర్శించారు. రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే, శుక్రవారం రాత్రి గంగిపల్లి గ్రామానికి చెందిన రెడ్డి రాధమ్మ మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాధమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట బాధిత కుటుంబాల సభ్యులు మాజీ సర్పంచ్ పొలాడి కవిత-వంశీధర్ రావు, మాజీ ఎంపీటీసీ రెడ్డి కళ్యాణి-సంపత్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మాజీ సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి హఠాన్మరణం

మంకు శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

చిగురుమామిడి, జనవరి 4: మండలంలోని నవాబ్ పేట గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ నాయకుడు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంకు శ్రీనివాస్ రెడ్డి (40) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో నిద్రలోనే మృతి చెందారు. తెలంగాణ ఉద్యమం ఆరంభం నుంచి అనేక పోరాటాలు, ఉద్యమాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. అలాగే, రెడ్డి సంఘం మండల జేఏసీ ప్రధాన కార్యదర్శిగా సైతం కొనసాగారు. మంకు శ్రీనివాస్ రెడ్డికి భార్య, కూతురు, వృద్ధులైన తల్లిదండ్రులు ఉండగా, ఆర్థికంగా లేకపోవడంతో గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు చందాలతో దహన సంస్కారాలు నిర్వహించారు. భౌతికకాయంపై మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ గులాబీ కండువా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీలు కొత్త వినీతా శ్రీనివాస్ రెడ్డి, అందే సుజాత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, బీఆర్ఎస్, వివిధ పార్టీల నాయకులు, రెడ్డి సంఘం మండల జేఏసీ నాయకులు సంతాపం ప్రకటించారు.

ఇరిగేషన్ ఇంజినీర్ల సమస్యలు పరిష్కరించండి

తిమ్మాపూర్, జనవరి 4: రాష్ట్ర ప్రభుత్వం నీటి పారుదల శాఖ ఇంజినీర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఇరిగేషన్ గ్రాడ్యుయేట్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె శ్రీధర్ కోరారు. శనివారం ఎల్ఎండీలోని నీటిపారుదల శాఖ సీఈ కార్యాలయంలో అసోసియేషన్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అసోసియేషన్ వ్యవస్థాపకుడు రిటైర్డ్ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ నాగేందర్‌రావ్, ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, కరీంనగర్ ఈఎన్సీ శంకర్, సీఈ సుధాకర్‌రెడ్డి హాజరుకాగా.. శ్రీధర్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల సమస్యలతో సతమతమవుతున్నామని, ప్రభుత్వం తమ సమస్యలను పరిగణనలోకి తీసుకుని పరిష్కరిస్తుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, అలవెన్సులు జాప్యం జరుగుతున్నదని చెప్పారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. అసోసియేషన్ నాయకులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

టీఎన్జీవో క్యాలెండర్ ఆవిష్కరణ

టీఎన్జీవో తిమ్మాపూర్, గన్నేరువరం యూనిట్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎల్ఎండీలోని సీఈ కార్యాలయంలో కరీంనగర్ ఈఎన్సీ శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఈఎన్సీ వెంకటేశ్వర్లు, ఎస్ఈలు రమేశ్, సుమతి, సుధాకర్‌రెడ్డి, ఈఈ నాగభూషణ్‌రావు, నాయకులు పోలు కిషన్, అంబటి నాగరాజు, పుప్పాల అశోక్‌రెడ్డి, లచ్చయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై కార్మికుల సమ్మెపై ప్రభుత్వం స్పందించాలి

తెలంగాణచౌక్, జనవరి 4: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సివిల్ సప్లై కార్మికులు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం స్పందించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని గోదాం గడ్డ వద్ద కూలి రేట్ల పెంపు కోసం నాలుగు రోజులుగా పౌరసరఫరాల గోదాం కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకొని పెంచిన కూలి రేట్లతో జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, నాయకులు అంజయ్య, రాజయ్య, లక్ష్మయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

మానేటి లఘు చిత్ర పోటీల విజేతలకు అవార్డుల ప్రదానం

కమాన్‌చౌరస్తా, జనవరి 4: తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో కరీంనగర్ ఫిలిం సొసైటీ, లఘు చిత్రాల నిర్మాతల మండలి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మానేటి లఘు చిత్రాల పోటీల విజేతలకు శనివారం కరీంనగర్ ఫిలిం సొసైటీ భవన్‌లో అవార్డులు, పారితోషిక ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ జీ వెన్నెల హాజరై లఘు చిత్రాల పోటీల్లో వివిధ విభాగాల్లో గెలుపొందిన వారికి అవార్డులు, నగదు పారితోషికం అందజేశారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, కలెక్టర్ పమేలా సత్పతి, మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలల జాయింట్ డైరెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్ లాల్, కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర, కార్యదర్శి లక్ష్మీగౌతమ్, జ్యూరీ సభ్యులు మల్లారెడ్డి, శివోత్తం, అక్షర కుమార్, సాహితీవేత్తలు గాజోజు నాగభూషణం, పీఎస్ రవీంద్ర, మాడిశెట్టి గోపాల్, అన్నవరం దేవేందర్, అశోక్ పాల్గొన్నారు.

జార్ఖండ్ కలెక్టర్‌ను కలిసిన వ్యాపారులు

జమ్మికుంట, జనవరి 4: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాధి జమ్మికుంటకు చెందిన దొడ్డె ఆంజనేయులు జార్ఖండ్ రాష్ట్రం డుంక జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న విషయం తెలిసిందే. శనివారం ఆయన స్వగ్రామానికి రాగా, స్థానిక వ్యాపారులు బచ్చు భాస్కర్, జడల భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. డుంక జిల్లాకు దొడ్డె ఆంజనేయులు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.

ఎస్కేప్ ద్వారా కాలువ నీటిని విడుదల చేయాలి

శంకరపట్నం, జనవరి 4: ఎస్సారెస్పీ కాలువ నీటిని ఎస్కేప్ ద్వారా దిగువ గ్రామాల ఆయకట్టుకు విడుదల చేయాలని పలువురు మాజీ సర్పంచులు శనివారం తహసీల్దార్ బత్తుల భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని ఎస్సారెస్పీ కాలువ దిగువ గ్రామాలైన ఎరడపల్లి, అర్కండ్ల, కన్నాపూర్, కాచాపూర్, గద్దపాక, కల్వల తదితర గ్రామాల్లో సాగునీరు లేక నారుమళ్లు ముదిరిపోతున్నాయని, అలాగే మిగతా గ్రామాల్లో నారుమళ్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కాలువ దిగువ గ్రామాలకు ఎస్కేప్ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని, తద్వారా రైతుల పంటల సాగుకు సహకరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కన్నాపూర్, కాచాపూర్, కల్వల, అర్కండ్ల గ్రామాల మాజీ సర్పంచులు కాటం వెంకటరమణారెడ్డి, కోండ్ర రాజయ్య, దాసారపు భద్రయ్య, చేర్ల అనిత-శ్రీనివాస్, పలువురు రైతులు ఉన్నారు.

హెడ్జ్ ఫ్యూజ్‌ల వద్ద ప్రమాద నివారణకు ఏర్పాట్లు

సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

ముకరంపుర, జనవరి 4: ట్రాన్స్‌ఫార్మర్లపై హెడ్జ్ ఫ్యూజ్‌ల వద్ద జరిగే ప్రమాదాలను నివారించి, నిరంతర సరఫరాకు నగరంలో విద్యుత్ అధికారులు చేపట్టిన చిన్న ప్రయోగం మంచి ఫలితాలను ఇస్తున్నది. సాధారణంగా ట్రాన్స్ ఫార్మర్ హెడ్జ్ ఫ్యూజ్ సెట్‌కు ఉండే పింగాణీ జాయింట్ వద్ద ఇనుప పరికరం ఉంటుంది. ఇప్పటి వరకు ఈ పరికరానికి ఎలాంటి రక్షణ లేదు. దీంతో పక్షి, ఉడుత, తొండ, బల్లి లాంటి చిరు ప్రాణులు ఇనుప పరికరానికి తాకగానే విద్యుత్ దాఘాతానికి గురై మృతి చెందడంతో పాటు సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నది. సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేయాలనే సంస్థ సీఎండీ కే వరుణ్ రెడ్డి సూచనల మేరకు నగర సబ్ డివిజన్-1 ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్ పర్యవేక్షణలో టౌన్ -1, 3, 5, 8 ఏఈలు, సిబ్బంది చర్యలు చేపట్టారు. పింగాణీ జాయింట్ వద్ద ఉండే ఇనుప పరికరానికి డెన్ ప్లాస్టర్, హై డెన్సిటీ పాలి ఇతిలిన్ పైపుతో ఇన్సులేషన్ ఏర్పాటు చేశారు. దీంతో గతంలో ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది. టౌన్-1 సబ్ డివిజన్ పరిధిలో 910 ట్రాన్స్ ఫార్మర్లకు గాను ఇప్పటి వరకు 240 ట్రాన్స్ ఫార్మర్లకు ఇన్సులేషన్ చేశారు. మరో నాలుగు ఫీడర్లలో వంద శాతం ఇన్సులేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. శనివారం నగరంలోని టౌన్-8 సెక్షన్‌లో చేపట్టిన పనులను ఎస్ఈ మేకరమేశ్ బాబు, డీఈలు(టెక్నికల్) చంద్రమౌళి, రాజం పరిశీలించారు.

టీఏపీవెటా ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు

హౌసింగ్‌బోర్డుకాలనీ, జనవరి 4: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తెలంగాణ ఆర్ట్, పీఈటీ, వర్క్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (టీఏపీవెటా) ఆధ్వర్యంలో 'సంక్రాంతి సిత్రాల సంబురాలు' అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు తాడూరి లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. A-4 సైజ్ పేపర్‌పై చిత్రాలు గీయాలని, దానిపై పాఠశాల స్టాంప్, ప్రధానోపాధ్యాయుడి సంతకం తప్పనిసరి అని తెలిపారు. చిత్రం గీసిన పేపర్‌పై విద్యార్థి పేరు, తరగతి, చిరునామా, సెల్ నంబర్ రాసి.. ఈ నెల 10లోగా టీఏపీవెటా కార్యాలయం ఇంటి నంబర్: 2-7-146, బస్టాండ్ పక్కన, కళాభారతి ఎదురు గల్లీ, కరీంనగర్-505001 చిరునామాకు నేరుగా లేదా, పోస్ట్ ద్వారా పంపించాలని కోరారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 98493 02904 సెల్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సాంకేతిక విజ్ఞానంతో జీవనశైలిలో అనేక మార్పులు

హుజూరాబాద్ టౌన్, జనవరి 4: ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో మానవ జీవనశైలిలో అనేక మార్పులు వస్తాయని, సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే పరికరాలు భవిష్యత్తులో అనివార్యమవుతాయని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం సింగాపూర్ గ్రామంలోని కిట్స్ కాలేజీలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే శంకర్ అధ్యక్షతన జరిగిన 'ఎసెన్షియల్స్ ఆఫ్ రీ-ఇన్ఫోర్స్‌మెంట్' వర్క్‌షాప్ ముగింపు సమావేశానికి డాక్టర్ వెంకటేశ్వర్ రావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ఆధునిక సాంకేతికత, రీఇన్‌ఫోర్స్‌మెంట్ లర్నింగ్‌కు సంబంధించి మార్గదర్శనం చేశారు. డైరెక్టర్ డాక్టర్ కే శంకర్ మాట్లాడుతూ.. నూతన పరిజ్ఞానంతో విద్యార్థులు ప్రాజెక్టులు రూపొందించాలని, ఇందుకు కళాశాల సహకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ విభాగాధిపతి, డీన్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ రావు, అధ్యాపక సమన్వయకర్తలు ఎం. సుభద్ర, డి. రవి, ఆర్. రాజశేఖర్, సహ సమన్వయకర్తలు రాధిక, రేఖ, పద్మ అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

గంగాధర, జనవరి 4 : అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన వేముల బాలమల్లు(43) చేసిన అప్పులు చెల్లించలేక కొంతకాలంగా బాధపడుతున్నాడు. అప్పులు తీర్చేదారి లేక శనివారం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE

★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే త